


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

శనివారం 13 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి





భానుపురి/చివ్వేంల

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చివ్వేంల మండల పరిధిలోని దురాజుపల్లి గ్రామ సమీపంలో గల ప్రతిష్ట ఫార్మసీ కళాశాల లో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పట్ల విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మన సమాజం నుండి డ్రగ్స్ తరిమివేసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నది, దీనికోసం సంబంధిత ప్రభుత్వ అధికారులు, జిల్లా పోలీస్, జిల్లా యంత్రాంగం అనుక్షణం పని చేస్తుంది అన్నారు.యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు సాధన చేయాల్సి అన్నారు, కష్టపడే వయస్సులో వ్యసనాలకు అలవాటు పడొద్దు, చెడుకు దూరంగా ఉండాలి, మంచి స్నేహితులను, మంచి పుస్తకాలను ఎంచుకోవాలి, తల్లిదండులకు, చదువు నేర్పు గురువులకు మంచి పేరు తేవాలి, సమాజానికి, ప్రజలకు మంచి సేవ చేసే వనరుగా ఎదగాలి అని అన్నారు. మహిళలు, బాలలు, విద్యార్థుల రక్షణలో అనుక్షణం పని చేస్తున్నాము అన్నారు.ప్రస్తుతం మన సమాజాన్ని, ముఖ్యంగా దేశానికి వెన్నుముక లాంటి యువతను డ్రగ్స్ మహమ్మారి పట్టిపీడిస్తోందని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల భావితరాలు తమ ఉజ్వల భవిష్యత్తును చేతులారా కోల్పోతున్నాయని హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసలైన యువత తీవ్ర అనారోగ్యాల బారిన పడటమే కాకుండా, కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని పేర్కొన్నారు. “దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. అలాంటి యువశక్తి డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు బానిసలైతే దేశ ప్రగతి కుంటుపడుతుంది. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్క విద్యార్థి, పౌరుడు భాగస్వాములు కావాలి అన్నారు. జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరుగుతున్నా, వాటి మూలాలు ఉన్నా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించి సహకరించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. గంజాయి లేదా ఇతర వ్యసనాలకు బానిసలైన వారు ఎవరైనా ఉంటే, వారిని గుర్తించి సంరక్షణ (పునరావాస) కేంద్రాలకు తరలించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి అందరూ కృషి చేయాలి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ డ్రగ్స్ నిర్మూలనకు అనుక్షణం పనిచేస్తోంది. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి సంబంధిత కేసుల్లో ఉన్న పాత నేరస్థులపై నిఘా ఉంచి, వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాము అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడంలో యువతరం ముందుండాలని, సమాజ మార్పు కోసం పోలీసులతో చేతులు కలపాలని ఎస్పీ పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో తమ వంతు భాగస్వాములం అవుతాము, గంజాయి అలవాటు ఉన్నవారిలో పరివర్తన తెస్తాం అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించడం జరిగినది.ఈ సమాజంలో మరో తీవ్ర అంశాలు రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు అన్నారు. వీటిని అరికట్టాలంటే ప్రజలు అవగాహన, ముందు చూపు, జాగ్రత్తలు ప్రదానం అన్నారు. జీవితంలో ఎదిగి కుటుంబాలకు తల్లిదండ్రులకు అండగా ఉండాల్సిన వారు అజాగ్రత్తగా వాహనాలు నడుపు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ముందస్తు జాగ్రతలు పాటించాలి అని కోరారు. అత్యాశకు పోయి అపరిచితులకు మన వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చినట్లయితే మోసాలకు గురి అవుతామని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు ఫోన్లకు వచ్చే మెసేజ్లను స్పందించి అపరిచితులకు ఎవరు డబ్బులు చెల్లించవద్దు అని కోరారు. బహుమతులు ఉన్నాయి తక్కువ తక్కువ వడ్డీలకు లోన్స్ ఇస్తాము ప్రభుత్వ పథకాలు ఇస్తాము ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి అంటే అలాంటి సమాచారాన్ని నమీ ఎవరు కూడా అపరిచితులకు డబ్బులు పంపకూడదు అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, చివ్వేంల ఎస్ఐ మహేష్, కనకరాత్నం, బరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్సై నీలిమ, పోలీసు సిబ్బంది కళాశాల యాజమాన్యం డా. రామకృష్ణ, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మోడీ నాయకత్వంలో దేశాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: శానంపూడి సైదిరెడ్డి

భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధి, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీజేపీ ఎన్నారై సెల్ రాష్ట్ర కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి కుటుంబాలఅభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్షలాది నిరుపేద కుటుంబాలకు గృహాలు అందించగా, జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉజ్వల యోజన కింద పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచినట్లు పేర్కొన్నారు.రైతుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా నేరుగా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని, పంట బీమా పథకాల ద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కోట్లాది కుటుంబాలకు ఆరోగ్య భద్రత అందుతుండగా, జన ఔషధి కేంద్రాల ద్వారా నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇచ్చి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, సెమీకండక్టర్ తయారీ వంటి రంగాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భారత్‌ను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు



వేస్తోందన్నారు. నక్సలిజం నిర్మూలనలో కూడా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని పేర్కొంటూ, భద్రతా దళాల త్యాగాలు, సమర్థ వ్యూహాల ఫలితంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధి వాతావరణం నెలకొంటోందన్నారు. దేశ భద్రత, ఆర్థిక పురోగతి, సామాజిక సంక్షేమం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చిన ఆయన, దేశ ప్రయోజనాలు, జాతీయ భద్రత, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శక సూత్రాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో 12 ఏండ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని శిక్షించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

జూన్ 6న ఖమ్మం జిల్లాలో హిందూ బాలిక పై జరిగిన అత్యాచార ఘటన అత్యంత బాధాకరం ఈ సంఘటనను విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తోంది.బాధితురాలికి, ఆమె కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కారింగుల ఉపేందర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్నఅత్యాచారాలు ఇతర నేరాల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేస్తోందన్నారు. సమాజంలో మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలనీ నేరస్తులు ఎవరైనా సరే, చట్టం ముందు కఠిన శిక్షను ఎదుర్కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.మహ్మద్ గౌస్ బాధిత మహిళా పై హత్యాచారం చేసి కేసును ఆధారాలు లేకుండా చేయాలని,రెండవ అంతస్తు నుండి కిందకు పడేసి తనకు సంబంధం లేనట్లుగా ప్రవర్తించాడు అని ఇలాంటిజిహాదీ తీవ్రవాదిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సద్ది శ్రీవాణి ప్రాంత మాతృశక్తి సహ సంయోజిక,బుద్దే సత్యవతి నల్గొండ విభాగం మాతృశక్తి విభాగ్ సంయోజిక, జిల్లా ప్రధాన




కార్యదర్శి రచ్చ సతీష్ బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ నవీన్, మాతృ శక్తి సంయోజిక సూర్యాపేట జిల్లా కీర్తి సుధారాణి, రౌతు కావ్య, తమ్మనబోయిన హేమ, ఉమా, బానోత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యనిర్వాహక సభ్యులుగా బండారు రాజా ప్రమాణ స్వీకారం

భానుపురి /హైదరాబాద్



సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బండారు రాజా శుక్రవారం హైదరాబాద్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార మహోత్సవం లో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యనిర్వాహక సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరు గతంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి గా, ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు బచ్చు పురుషోత్తంతోపాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు రాజా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని, నా వంతుగా శక్తివంచన లేకుండా ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవము

భానుపురి /సూర్యాపేట రూరల్




అంతర్జాతీయ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా (టాప్రా) సంఘం ఆధ్వర్యంలో బాషానాయక్ తండాలో నివసిస్తున్న 30 మంది బుడిగ జంగాల పిల్లలకు పలకలు, బలపాలు, నోటుపుస్తకాలు, పెన్నులు, చాక్లెట్స్ జానీ మియా సైదా బేగం దంపతుల సహకారంతో పంపిణి చేయనైనది. ఈ సందర్భంగా అధ్యక్షులు బెడద సోమయ్య మాట్లాడుతు బడి ఈడు పిల్లలు బడిలోనే చదువుతూ బడిమానేయకుండా బాల కార్మికులుగా తయారు కావోద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వం,పాఠశాలలను తగ్గించకుండా సరైన అవకాశాలను కల్పించాలని, బాల కార్మికులు లేని రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రదాన కార్యదర్శి దున్నె యాదగిరి మాట్లాడుతూ బీదరీ కాలికి దిగువన ఉన్న కుటుంబాల పిల్లలందరు ఉన్నత విద్యను చదివినప్పుడే బాలకార్మికులు లేని రాష్ట్రంగా ఏర్పడుతుందని తెలియచేశారు .ఇట్టి కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు యరమాద వెంకటేశ్వర్లు, కోశాధికారి రాపోలు సత్యనారాయన సీనియర్ నాయకులు సత్యనారాయణ సాంబశివరావు, కరుణాకర్ రెడ్డి, రాంరెడ్డి, .క్రిష్ణయ్య జమాలుద్దీన్, బోస్లష్, జానకి రాములు, కాలనీ వాసులు జీవరత్నం, శేఖర్, ప్రసాద్ మొదలగు వారు పాల్గొన్నారు.

# పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ నుండి తండా ప్రాంతాలను మినహాయించాలి



భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ నుండి తండా ప్రాంతాలను మినహాయించాలని కోరుతూ తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం అదనపు జిల్లా కలెక్టర్ హరి సింగ్ నాయక్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ తండా ప్రాంతాల్లోని పాఠశాలలను రేషనలైజేషన్ పరిధి నుండి మినహాయించి, అక్కడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తండా ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యా సదుపాయాలను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొర్ర భగ్గులాల్ నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ధరావత్ వసరామ్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ధరావత్ మోతీలాల్ నాయక్, సూర్యాపేట డివిజన్ అధ్యక్షుడు బానోత్ లింగా నాయక్, ధరావత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన జిల్లా పోలీసులు

భానుపురి /నల్లగొండ




ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చీరల వ్యాపారి తన అవసరాల నిమిత్తం 30 వేల రూపాయలు అప్పు ఇవ్వాలని మృతుడు సాయి కుమార్ ని పలుమార్లు అడిగినప్పటికీ, అతను తన వద్ద డబ్బులు లేవు అని తిరస్కరించడంతో అతనిపై కోపం పెంచుకొని పథకం ప్రకారం హత్య చేశాడని జిల్లా అడిషనల్ ఎస్పి జి రమేష్ వెల్లడించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లి శివారులో నిర్మాణంలో వున్న వెంచర్ లో జరిగిన బోథ్ సాయి కుమార్( 27 ) హత్య కేసులో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 6 గ్రాములు బంగారు ఆభరణాలు, రెండు సెల్ ఫోన్లు చేసుకున్నారని వివరించారు.నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పూర్ఖాన్ అలియాస్ మహేష్, అదేవిధంగా మరో నిందితుడు ఆరిఫ్ లు ప్రస్తుతం నల్లగొండ పట్టణంలోని నటరాజ్ టాకీస్ దగ్గర, మేతర్ కాలనీ లో నివాసం ఉంటున్నారని తెలిపారు. మృతుడు బోథ్ సాయి కుమార్ పట్టణ పరిధిలోని గొల్లగూడెం నివాసి.ఇతను గ్రామ దేవతల పండుగలు, ముఖ్యంగా ఎల్లమ్మ పండుగల సందర్భంగా ఆడవేషం ధరించి కొలుపులు చెప్పే వాడు.నిందితుడు పూర్ఖాన్ అలియాస్ మహేష్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడు. జీవనోపాధి కోసం నల్లగొండకు వచ్చి చీరెల వ్యాపారం చేస్తూ ఉండేవాడని ఈ క్రమంలో సాయి కుమార్‌తో పరిచయం ఏర్పడి, ఇద్దరూ అప్పుడప్పుడు కలిసి మద్యం సేవించేవారని తన చీరల వ్యాపార అవసరాల నిమిత్తం నిందితుడు సాయి కుమార్‌ను రూ.30,000/- అప్పుగా ఇవ్వమని పలుమార్లు అడిగినప్పటికీ, అతను డబ్బులు తనవద్ద లేవు అని తిరస్కరించడంతో నిందితుడు అతనిపై కోపం పెంచుకుని ఈ క్రమంలో సాయి కుమార్ వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దోచుకోవాలనే ఉద్దేశంతో అతన్ని హత్య చేయాలని నిందితుడు ముందుగానే పథకం రచించాడని వివరించారు. పథకం ప్రకారం ఈనెల 8న పూర్ఖాన్ తన సహచరుడు ఆరిఫ్‌తో కలిసి సాయి కుమార్‌ను మద్యం పార్టీ పేరుతో మిర్యాలగూడ రోడ్డులోని కేశరాజుపల్లి శివారులో ఉన్న నిర్మాణంలో ఉన్న వెంచర్ ప్రాంతానికి తీసుకెళ్లాడని అక్కడ ముగ్గురూ కలిసి మద్యం సేవించిన అనంతరం రాత్రి సమయంలో డబ్బులు అప్పుగా ఇవ్వకపోవడం తో గొడవకు దిగారని ముందుగా రచించిన పథకం ప్రకారం పూర్ఖాన్, ఆరిఫ్ కలిసి సాయి కుమార్‌పై దాడి చేశారని తెలిపారు. పూర్ఖాన్ సిమెంట్ రాయితో సాయి కుమార్ తలపై బలంగా కొట్టడంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడని హత్య అనంతరం నిందితులు మృతుడి వద్ద ఉన్న బంగారు తాయెత్తు, బంగారు చెవి కమ్మ, ముక్కుపుడకలను తీసుకుని అనంతరం నిందితులు మృతుడి హోండా ఆక్టివా స్కూటీ, సెల్ ఫోన్ తీసుకొని అక్కడి నుండి పరారయ్యారని వెల్లడించారు. తమపై అనుమానం రాకుండా రక్తపు మరకలు అంటిన బట్టలను దాచిపెట్టి, విజయవాడకు పారిపోయి దోచుకున్న బంగారాన్ని అమ్మేందుకు ప్రయత్నించారని తెలిపారు. అయితే పోలీసులు సాంకేతిక ఆధారంగా నిందితులను గుర్తించి శుక్రవారం ఉదయం విజయవాడ లో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించడం జరిగిందన్నారు.

# రాజ్యాధికార సమరభేరికి మోత్కుపల్లి నరసింహులకు ఆహ్వానం

భానుపురి/ హైదరాబాద్



సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలు, బహుజన రాజకీయ సాధికారత లక్ష్యాల సాధన కోసం జూలై 5న భువనగిరి పట్టణంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" మహాసభకు మాజీ మంత్రి, సీనియర్ ప్రజానాయకుడు, సామాజిక న్యాయ ఉద్యమకారుడు మోత్కూ పల్లి నర్సింహులు ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ తో పాటు వేములవాడ మదన్మోహన్ చారి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ రాష్ట్ర నాయకులు సుతారపు రంగన్న, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్, బిక్షపతి గౌడ్, సుదర్శన్ లు మోత్కుపల్లి నరసింహులును కలసి సభ ఆహ్వాన పత్రికను అందజేశారు. దశాబ్దాల ప్రజా జీవిత అనుభవంతో పాటు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో ప్రతిబింబిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిగా మోత్కుపల్లి నరసింహులు ప్రత్యేక గుర్తింపు పొందారని వారు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం కోసం జరుగుతున్న ఈ చారిత్రాత్మక ఉద్యమానికి ఆయన వంటి అనుభవజ్ఞుల మద్దతు ఎంతో అవసరమని వట్టే జానయ్య యాదవ్ అన్నారు. రాజ్యాధికార సమరభేరి కేవలం ఒక సభ మాత్రమే కాకుండా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల రాజకీయ సాధికారతకు దిశానిర్దేశం చేసే ప్రజా ఉద్యమ వేదికగా నిలవబోతుందని ఆయన వివరించారు. రాబోయే తరాలకు సామాజిక న్యాయం ఆధారిత పాలనను అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మహాసభకు హాజరై తన ఆశీర్వాదం, మద్దతు అందించాలని మోత్కుపల్లి నరసింహులును నాయకులు కోరారు. ఆయన పాల్గొనడం ద్వారా రాజ్యాధికార ఉద్యమానికి మరింత బలం చేకూరుతుందని, బహుజన వర్గాలకు కొత్త ఉత్తేజం లభిస్తుందని వారు అభిప్రాయ పడ్డారు.ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## భువనగిరి రాజ్యాధికార సమరభేరికి భారీ సన్నాహాలు

భానుపురి /భువనగిరి



తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో జరగనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభ కోసం భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూనియర్ కళాశాల ఎదురు, బస్టాండ్ సమీపంలోని దొడ్డి కొమరయ్య నగర్‌లో జరిగే ఈ సభకు లక్షకు పైచిలుకు జనాన్ని సమీకరించేందుకు గత పది రోజులుగా గ్రామగ్రామాన జనసమీకరణ కార్యక్రమం కొనసాగుతోంది.రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ శుక్రవారం సభాస్థలిని పరిశీలించారు. వేదిక, కళాకారుల వేదిక, ప్రజా ఆసన ప్రాంతం, అమరవీరుల చిత్రపటాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో మలుపుగా నిలుస్తుందని, బడుగు బలహీన వర్గాల స్వచ్ఛంద తరలింపు ఇందుకు నిదర్శనమని వట్టే జానయ్య యాదవ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ యువత సాంప్రదాయ అగ్రకుల పార్టీలకు దూరంగా ఉండి, రాజ్యాధికార పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# కేంద్రం కీలక నిర్ణయం

**-125 రోజులకు పని దినాల పెంపు...**

భానుపురి /న్యూఢిల్లీ



గ్రామీణ ప్రజల ఆర్థిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం క్రింద గతంలో ఉన్న 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచుతూ 'వీబీజీ రామ్' పథకాన్ని ప్రవేశపెట్టింది.ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.ఈ కొత్త పథకం 2026, జూలై 1 నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి వస్తుందని,ఇది గ్రామీణ ఉపాధి కల్పనలో కీలక మలుపు అని ఆయన పేర్కొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుపై వ్యాపార వర్గాలతో అవగాహన సమావేశం


భానుపురి /సూర్యాపేట టౌన్



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "ఆల్టర్నేటివ్స్ టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్" అంశంపై శుక్రవారం సూర్యాపేట మున్సిపాలిటీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత లక్ష్మి మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ పురుషోత్తం మున్సిపల్ విభాగానికి చెందిన ప్రసాద్ కిరాణా అండ్ ఫ్యాన్సీ అసోసియేషన్ అధ్యక్షులు వెన్న రామచంద్ర రెడ్డి కార్యదర్శి పాలవరపు నరసింహారావు పలువురు సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని దశలవారీగా తగ్గించి, పర్యావరణహితప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాల్సిన అవసరంపై వ్యాపార వర్గాలతో విస్తృతంగా చర్చించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలుగుతున్న పర్యావరణ సమస్యలను వివరించి, ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పించారు.సమావేశంలో వ్యాపార వర్గాలు వ్యక్తం చేసిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, వాటిని కొంతవరకు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో వ్యాపార వర్గాల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అధికారులు మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో వ్యాపార వర్గాలను భాగస్వాములుగా తీసుకుని ముందుకు సాగుతామని, వారి సమస్యలను పరిగణనలోకి తీసుకుంటూ సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసింది.

# నాగార్జున సాగర్ ఎస్ పిఎఫ్ ఆధ్వర్యంలో 5 కే రన్





భానుపురి/నాగార్జునసాగర్ టౌన్

నంది కొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ ఎస్‌పిఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం 5 కె రన్ ను కార్యక్రమం నిర్వహించిన్నట్లు ఎస్ పి ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు తెలిపారు. ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతిలక్రా, జోన్ డి ఐ జి మాధవరావు ఆదేశాల మేరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక యాక్షన్ 99 కార్యక్రమంలో భాగంగా పైలాన్ కాలనీ పిల్లర్ నుండి డౌన్ పార్క్ వరకు 5 కే రన్ నిర్వహించామన్నారు. దీనితోపాటు ఫిజికల్ ఫిట్నెస్ కోసం యోగాసనాలు, ఎక్సర్సైజులు నిర్వహించారు. వీటి వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడడంతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను నివారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎఫ్ సాగర్ డ్యాం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జెన్‌కో ఎస్‌పి ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ నాయుడు, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రఘు,ఏ ఎస్‌ఐ లు అహ్మద్, యూసుఫ్, పుల్లయ్య, రవీందర్, జెన్‌కో, సాగర్ డ్యామ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీత్ల పండుగ సందర్భంగా బోర్ నిర్మాణానికి శ్రీకారం

భానుపురి/ఖమ్మం



సీత్ల పండుగను పురస్కరించుకుని 14వ వార్డులో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో బోర్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ వైస్ చైర్మన్ కట్లా సంతోష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సీత్ల పండుగ సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, 14వ వ వార్డు కౌన్సిలర్ ధీరావత్ వెంకటేశ్వర్లు, వెంకట్ , ప్రజాప్రతినిధులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.